RNI NO. TELTEL/2023/87655
2-07-2025
# దీక్ష ప్రభ
బుధవారం
సంపుటి : 03 సంచిక : 78 పేజీలు : 4 | రూ.5
www.deekshaprabha.com
Follow: deekshaprabha

## రైల్వే సేవల యాప్.. రైల్ వన్

■ లాంచ్ చేసిన అశ్వినీ వైష్ణవ్



**ఢిల్లీ, దీక్షప్రభ:** రైల్వేకు సంబంధించిన అన్ని సేవలూ ఒకేచోట అందించే సూపర్ యాప్ ఒకటి అందుబాటులోకి వచ్చింది. 'రైల్ వన్' పేరిట రైల్వే శాఖ విడుదల చేసిన దీని సాయంతో రిజర్వ్‌డ్, అన్ రిజర్వ్‌డ్ టికెట్లు, ప్లాట్ ఫామ్ టికెట్లు, రైళ్ల ఎంక్వైరీ, పీఎన్ఆర్, జర్నీ ప్లానింగ్, రైల్ మదద్, ఫుడ్ ఆన్ ట్రైన్ వంటి, ప్రయాణీకులకు అవసరమైన దాదాపు అన్ని సేవలూ పొందొచ్చు. సేవలు పొందొచ్చు. ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లు ఈ యాప్ను డౌన్లోడ్ చేసుకోవచ్చు. ఈ యాప్ ను అభివృద్ధి చేసిన సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్ వార్షికోత్సవం సందర్భంగా రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ యాప్ ను లాంచ్ చేశారు.









# మృతుల కుటుంబాలకు రూ.కోటి ఆర్థిక సహాయం



- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ● సిగాచి ఫార్మా సందర్శించిన ముఖ్యమంత్రి
- పరిశ్రమలో రాష్ట్రస్థాయి ఉన్నత అధికారులతో సమీక్ష
- ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశం

**పటాన్ చెరు, దీక్షప్రభ:** భారీ అగ్ని ప్రమాదం సంభవించిన సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచి ఫార్మా పరిశ్రమను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సందర్శించారు. భారీ అగ్ని ప్రమాదం జరిగిన సిగాచి పరిశ్రమలో ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. సందర్భంగా పరిశ్రమ ఆవరణ లో రాష్ట్రస్థాయి ఉన్నత అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. ప్రమాదానికి గల కారణాలను వెలికి తీయడం కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఉన్నత స్థాయి అధికారులతో కమిటీ ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. కమిటీ నివేదిక ఆధారంగా ప్రమాదానికి గల కారణమైన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి సంఘటనలు ఇతర పరిశ్రమలలో జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం కోసం కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ నివేదిక ఆధారంగా రాష్ట్రంలోని అన్ని పరిశ్రమలలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. నిరంతరం అధికారుల బృందం పరిశ్రమలను తనిఖీ చేయాలని ప్రమాదం జరిగే అవకాశం ఉన్నచోట జాగ్రత్త చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పరిశ్రమలు ఫైర్ సేఫ్టీ శాఖల అధికారులను ఆదేశించారు. పరిశ్రమల్లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన మృతుల కుటుంబాలకు ప్రభుత్వం పరిశ్రమల యాజమాన్యంతో కలిసి రూ.కోటి రూపాయల ఆర్థిక సహాయం అందజేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రమాదంలో మృతి చెందిన కుటుంబీకులకు ప్రభుత్వం, పరిశ్రమల యాజమాన్యం కలిసి రూ.కోటి,తీవ్రంగా గాయపడిన కార్మికులకు రూ.10 లక్షలు, స్వల్పంగా గాయపడిన కార్మికులకు రూ.5 లక్షలు ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. తక్షణ సహాయంగా మృతుల కుటుంబ సభ్యులకు రూ.లక్ష, క్షతగాత్రులకు రూ.50 వేలు అందజేయాలని స్థానిక కలెక్టర్ కు ఆదేశించినట్లు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వ్యక్తులకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. అవసరమైతే క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం ఇతర పెద్ద ఆసుపత్రులకు తరలించాలని వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ పోలీసు సిబ్బందికి సూచించారు. ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తుల మృతదేహాలను వారి వారి స్వస్థలాలకు ప్రభుత్వం ద్వారా ఉచితంగా చేర్చేలా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన గాయపడిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ప్రమాదంలో గాయపడిన మృతి చెందిన కుటుంబాలకు చెందిన పిల్లలను ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ కు ఆదేశించారు. అనంతరం ప్రమాదంలో గాయపడి పటాన్ చెరులోని ధ్రువ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరామర్శించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని అధైర్య పడద్దని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు,కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్, రెవెన్యూ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి,కలెక్టర్ పి.ప్రావిణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్, రాష్ట్రస్థాయి అధికారులు,ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.





## రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి దరఖాస్తుపై సమగ్ర పరిశీలన: మంత్రి పొంగులేటి



**హైదరాబాద్, దీక్షప్రభ:** భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి దరఖాస్తుపై సమగ్ర పరిశీలన ఉంటుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలియజేశారు. రెవెన్యూ అధికారులతో మంగళవారం సమీక్షించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తులపై అధికారులకు పలు సూచనలు చేశారు. అందిన ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి అర్హమైన వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తుపై సరైన విచారణ జరపాలని, సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయాలని మంత్రి సూచించారు. అవసరమైన డాక్యుమెంట్లు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి ఆధారాలన్నింటినీ ఒకే డాక్యుమెంట్ గా భూభారతి పోర్టల్లో అప్‌లోడ్ చేయాలన్నారు.

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు.. కన్నదీ విన్నదీ నలుగురితో పంచుకున్నదీ ప్రజలకు అందించాలని..వారి సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలకు దిక్సూచిగా మారాలని అనుకుంటున్నారా? విశాలవంతమైన జర్నలిజం వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

రండి.. అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..!!

దీక్ష ప్రభ
తెలుగు దినపత్రిక

జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారిగా రిపోర్టర్లు కావలెను

మీకో చక్కని వేదికగా నిలుస్తోంది. ఎవరి ఒత్తిడి లేని విలేకరి వృత్తిని చాటేందుకు సాదరంగా ఆహ్వానిస్తోంది.


సంప్రదించండి
95500 21491

## గోల్కొండ కోటపై బీజేపీ జెండా ఎగరేస్తం

### రాష్ట్ర అధ్యక్షుడైనెనా కార్యకర్తగానే పనిచేస్త



**హైదరాబాద్, దీక్షప్రభ:** తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావాలనీ, గోల్కొం డ కోటపై కాషాయ జెండా ఎగరాలని బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు నారపరాజు రావుచందర్‌రావు అన్నారు. రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లాలని పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా రావుచందర్ రావు మంగళవారం కిషన్ రెడ్డి నుంచి బాధ్య తలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వ హించిన సభలో రావుచందర్‌రావు మాట్లాడుతూ ఎంతో మంది కార్యకర్తలు, నేతల త్యాగాలతో బీజేపీ ఈ స్థాయిలో ఉందని వ్యాఖ్యానించారు. ప్రధాని మోడీ, అమిత్ షా, జేపీ నడ్డా, బీఎల్ సంతోష్ నాయకత్వంలో ముందుకెళతామని స్పష్టం చేశారు. 14 కోట్ల సభ్యత్వాలతో బీజేపీ ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీగా ఉంది. అలాంటి రాజకీయ పార్టీకి రాష్ట్ర శాఖ అధ్యక్షుడినయ్యా. తెలంగాణ అధ్య క్షుడిగా పార్టీ అధిష్టానం నన్ను ప్రకటిం చడం గర్వంగా భావిస్తున్నానని చెప్పారు. బీజేపీకి రాష్ట్ర అధ్యక్షుడైనెనా కార్యకర్తగానే పని చేస్తా. పార్టీలో నాయకులంతా సవు ష్టిగానే పని చేస్తారు. కొత్త పాత తేడా లేదని స్పష్టం చేశారు. ఎవ్వైరెనా బీజేపీలో చేరినప్పటి నుంచే పార్టీ వ్యక్తులు. కొత్త నీరు రావాలి. యువత మహిళలు బీజే పీలో చేరి పార్టీని బలపరచాలని పిలు పునిచ్చారు. ప్రజాస్వామ్య, వికసిత్ తెలం గాణకు బీజేపీ అధికారంలోకి రావాలి. ప్రజలు పార్టీ వైపు చూస్తున్నారు. అధికా రంలోకి రావడమే లక్ష్యంగా కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లాలనీ, స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఫేక్ యూనివర్సిటీ నడుపు తోంది. బీజేపీ నేతలను సోషల్ మీడి యాలో అవమానకరంగా ట్రోల్ చేస్తున్నా రని మండిపడ్డారు. రావుచందర్‌రావు సౌమ్యుడు కాదు..14 సార్లు జైలుకు వెళ్లి వచ్చిన. విద్యార్థుల కోసం పోరాడి పోలీ సుల లాఠీ దెబ్బలు తిన్నానని స్పష్టం చేశారు. ప్రజాస్వామిక పద్ధతిలో ప్రభ ుత్వంపై పోరాటం చేస్తాం, తెలంగాణ ప్రజల కోసం పోరాడుతా అందుకోసం ప్రజలు, కార్యకర్తలు, నేతలు నాతో కలసి రావాలని ఈ సందర్భంగా రావుచందర్ రావు పిలుపునిచ్చారు.



## ఏపీ 484 టీఎంసీలకు మించి వాడుకోరాదు

**హైదరాబాద్, దీక్షప్రభ:** పోలవరం-బనకచర్లపై కేంద్రానికి మన అభ్యంతరాలను తెలిపామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. బనకచర్ల ప్రాజెక్టు గోదావరి వాటర్ ట్రైబ్యునల్ తీర్పునకు వ్యతిరేకమని వాదించామన్నారు. 'పోలవరం, ధవళేశ్వరానికి కలిపి ఏపీ 484 టీఎంసీలకు మించి వాడుకోరాదు. పోలవరం నుంచి నీటి ఎత్తిపోతల కోసం 2 టన్నెల్ నిర్మాణాలు ప్రతిపాదించారు. రోజుకు 20వేల క్యూసెక్కులు తరలించేలా 2 టన్నెల్స్ ప్రతిపాదన పెట్టారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే బనకచర్ల ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగింది. కృష్ణా గోదావరి జలాల్లో గత పదేండ్లలో రాష్ట్రానికి అన్యాయం జరిగింది. గోదావరి జలాలను సీమకు తరలిస్తుంటే కేసీఆర్ నోరెత్తలేదు'అని ఉత్తమ్ అన్నారు.





# బాధితులకు అండగా ప్రజా ప్రభుత్వం

## మృతులకు రూ.కోటి నష్ట పరిహారం కంపెనీ

- యాజమాన్యంతో మాట్లాడి ఇప్పిస్తాం అని ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు
- రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నీలం మధు ముదిరాజ్
- ఘటనా స్థలం సిగాచీ పరిశ్రమను సందర్శించిన సీఎం రేవంత్ రెడ్డి,మంత్రులు
- ధ్రువ ఆసుపత్రిలో క్షతగాత్రులకు పరామర్శ
- చనిపోయిన వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన సీఎం,మంత్రులు

**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** సిగాచీ పరిశ్రమలో బాధితులైన ప్రతి కుటుంబానికి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు.మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు దామోదర రాజా నరసింహ,వివేక్ వెంకటస్వామి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు లతో కలసి ఘటన స్థలాన్ని పరిశీలించారు.మృతుల కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారాన్ని కంపెనీ యాజమాన్యం ద్వారా అందించడంతో పాటు క్షతగాత్రులకు రూ.10 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల పిల్లలకు ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్ లో విద్యను అందిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించారు. ఇందిరమ్మ పాలనను తలపిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ కష్టాలలో తోడు నిలుస్తూ ప్రతి ఒక్కరిని ఆదుకుంటున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఎం సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి,టీజీఐఐసి చైర్మన్, డీసీసీ అధ్యక్షులు నిర్మలా జగ్గారెడ్డి, చైర్మన్ ఎంఎ ఫహీం, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ మెదక్ ఇంచార్జ్ ముజాహిద్, వైస్ ప్రెసిడెంట్ గాలి అనిల్ కుమార్, పటాన్ చెరు ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# ఫార్మాస్యూటికల్ పరిశోధనలో భార్గవికి పీహెచ్ డీ



**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** పార్కిన్సన్స్ డ్రగ్ డెలివరీలో సంచలనాత్మక పరిశోధనను విజయవంతంగా పూర్తిచేసిన హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ పరిశోధక విద్యార్థిని చెక్కిళ్ల భార్గవిని డాక్టరేట్ వరించింది.నాసిక లోపల పంపిణీ కోసం సూక్ష్మవాహకాల మోతాదు సూత్రీకరణ, మూల్యాంకనంపై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న ఫార్మసీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.రఘువీర్ మంగళవారం ఈ విషయాన్ని వెల్లడించారు. పార్కిన్సన్స్ వ్యాధి చికిత్సలో కీలకమైన సవాలును డాక్టర్ భార్గవి పరిశోధన పరిష్కరిస్తుందని తెలిపారు. రక్త-మెదడు అవరోధం (బీబీబీ) అంతటా ప్రభావవంతమైన ఔషధ పంపిణీ,డోపమైన్ అగోనిస్ట్ అయిన పిరిబెడిల్ యొక్క ఇంట్రానాసల్ డెలివరీ కోసం నానోస్ట్రక్చర్డ్ లిపిడ్ క్యారియర్లను (ఎన్ఎల్సీ) అభివృద్ధి చేయడం ద్వారా ఆమె అధ్యయనం మెరుగైన ఔషధ ద్రావణీయత, పారగమ్యత, చికిత్సా సామర్థ్యాన్ని ప్రదర్శించిందన్నారు. అధునాతన క్వాలిటీ బై డిజైన్ (క్యూబీడీ) పద్ధతులను ఉపయోగించి ఆప్టిమైజ్ చేసిన నూతన నానోసస్పెన్షన్, మరియు సాలిడ్ లిపిడ్ నానో పార్టికల్స్ మెరుగైన మ్యూకోఅథెషన్, స్థిరత్వాన్ని చూపించడంతో పాటు సాంప్రదాయ పద్ధతులకు ఆశాజనకమైన నాన్-ఇన్వాసివ్ ప్రత్యామ్నాయాన్ని అందించినట్టు తెలిపారు. అధిక ఎన్ క్యాప్సులేషన్ సామర్థ్యం, నియంత్రిత విడుదల ద్వారా వర్గీకరించిన ఆమె సూత్రీకరణలు స్థిరమైన రక్తసాంద్రత, తగ్గిన దైహిక దుష్ప్రభావాలతో ఇన్ విట్రో, ఎక్స్ వివో ఫలితాలను కూడా సాధించాయన్నారు.ఇది క్లినికల్ అప్లికేషన్ కు ఉపకరిస్తుందని తెలియజేశారు. డాక్టర్ భార్గవి సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్ డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం,హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్, పలు విభాగాల అధిపతులు, సిబ్బంది పలువురు అభినందించినట్టు పేర్కొన్నారు.ఈ మైలురాయి డాక్టర్ భార్గవి అంకితభావం, శాస్త్రీయ నైపుణ్యాన్ని ప్రతిబింబించడమే కాకుండా సమాజ శ్రేయస్సు కోసం ఆరోగ్య సంరక్షణలో పరివర్తన పరిశోధన,ఆవిష్కరణలకు గీతం నిబద్ధతను ప్రతిబింబిస్తోందన్నారు.

# సిటీ సెంటర్ ఆసుపత్రి యాజమాన్యాన్ని సత్కరించిన ఏఎంసి డైరెక్టర్ అశోక్ బృందం



**జహీరాబాద్,దీక్ష ప్రభ:** పట్టణంలోని భారత్ గ్యాస్ కార్యాలయం ఎదురుగా సకల సౌకర్యాలతో పార్లమెంట్ ఇంచార్జ్ గంకటి శుక్లవర్ధన్ రెడ్డి బృందం ఆధ్వర్యంలో మల్టిస్పెషలిటీ ఆసుపత్రిని ప్రారంభించిన సందర్భంగా మంగళవారం నాడు జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అశోక్ బృందం వారికి శాలువకప్పి ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం యాజమాన్యమైన గంకటి శుక్లవర్ధన్ రెడ్డి,గంకటి రాఘవేందర్ రెడ్డిలను మిఠాయి తినిపించి భవిష్యత్తులో పేదల కోసం సరసమైన ధరలతో వైద్యం చేసి ప్రజల్లో మంచిపేరు ప్రఖ్యాతలు సంపాదించుకొని ఆకాశం అంత ఎత్తుకు ఎదగాలని డైరెక్టర్ అశోక్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గంకటి శ్రీధర్ రెడ్డి,గంకటి రాఘవేందర్ రెడ్డి,మొయిజ్ లష్కరి, బంగారి శ్రీనివాస్ ఇపెప్పలి కాంగ్రెస్ నాయకులు,సుభాష్ జాదవ్ మిర్జామ్ పల్లి తండా,అబ్దుల్లా సిద్దిఖీ తదితరులు పాల్గొన్నారు.

# పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో నవ దంపతులు మృతి

- రెండు నెలల క్రితం ప్రేమ పెళ్లి
- శోకసంద్రంలో ఇరు కుటుంబాలు



**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు పారిశ్రామికవాడలోని పాశమై లారంలో సిగాచీ పరిశ్రమ రియాక్టర్ పేలుడుతో మరణించిన వారి కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చింది. పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదం పలు కుటుంబాల్లో విషాదం నింపింది. ప్రమాద సమయంలో కంపెనీలో పనిచేస్తోన్న కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన నిఖిల్ రెడ్డి,శ్రీరమ్య ఆచూకీ గల్లంతైంది. నిఖిల్‌రెడ్డి ఇటీవలే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముద్దనూరు మండలం పెనికలపాడు గ్రామానికి చెందిన నామాల శ్రీరమ్యను ప్రేమ వివాహం చేసుకున్నారు.ఈ ఆషాఢ మాసం తర్వాత పెద్దల సమక్షంలో ఘనంగా వేడుక చేద్దామని నిర్ణయించుకున్నారు.ఈ క్రమంలో సోమవారం సిగాచీ ఔషధ పరిశ్రమలో జరిగిన దుర్ఘటనలో దంపతులిద్దరూ దుర్మరణం చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఇరు కుటుంబాలకు చెందిన వారు శోకసంద్రంలో మునిగిపోయారు.

# పాఠశాలలలో ప్రవేశాల పెంపు కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి





**జహీరాబాద్,దీక్ష ప్రభ:** ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యతో పాటు మౌలిక సదుపాయాల కల్పనలో కూడా అగ్రగామిగా ఉందని, విద్యార్థులకు అర్థవంతమైన రీతిలో బోధిస్తూ విద్యార్థుల ద్వారానే సమాధానాలు రాబట్టలని ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పెందోటి జగదీశ్వరయ్య అన్నారు. మంగళవారం నాడు రాంజోల్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎమ్ ఆధ్వర్యంలో జరిగిన ఉపాధ్యాయులు ప్రత్యేక సమావేశంలో పాఠశాలలో ప్రవేశాల పెంపు కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన బోధన ఉందని తెలుపుతూ రాంజోల్ వార్డులో ఇంటింటికి తీరిగి పిల్లల తల్లిదండ్రులకు వివరించాలని, పిల్లలకు అర్థవంతమైన రీతిలో బోధన చేసి వారి ద్వారానే సమాధానాలు రాబట్టాలని, వారంలో ఒకసారి టెస్టులు, నెలకు ఓసారి యూనిట్ టెస్టులు నిర్వహిస్తున్నామని, ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా ఉదయం అల్పాహారం,మధ్యాహ్న భోజనం మెనూ అమలు చేస్తున్నామని వివరించాలని సమావేశంలో ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు శ్రీమతి శకుంతల,వీణ కుమార్, సబిహ బేగం,షాహిస్త సాజిద్, మొహమ్మద్ అఖిల్, మంజుల, హపీజ్ అహేమద్,స్వప్న జ్యోతి తదితరులు ఉన్నారు.

# ఫిట్ నెస్ లేని బస్సులపై చర్యలు తీసుకోవాలి

- స్కూల్ బస్సుల్లో సీట్లకు మించి విద్యార్థులను తరలిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి
- బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు సిరివేసు సంతోష్



**కోటగిరి,దీక్ష ప్రభ:** బోధన్ డివిజన్ లో నిబంధనలకు విరుద్ధంగా బస్సులను నడుపుతున్న ప్రైవేట్ విద్యాసంస్థల పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో బోధన్ ఆర్టీవో ఆఫీస్ లో ఎంవీఐ శ్రీనివాస్ కు మంగళవారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సిరివేసు సంతోష్ మాట్లాడుతూ..నిబంధనలకు విరుద్ధంగా అనుభవం లేని డ్రైవర్ లు,ఫస్ట్ ఎయిడ్ కిట్స్ లేకుండా,ఎమర్జెన్సీ డోర్ లు లేకుండా బస్సులను నడుపుతున్నారని,ఇలాంటి బస్సులను గుర్తించి వాటిని సీజ్ చేయాలనీ డిమాండ్ చేశారు. వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నా,పరిమితికి మించి విద్యార్థులను బస్సులలో తరలిస్తూ విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా బస్సులను నడుపుతున్న యాజమాన్యలపై తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటామని ఎంవీఐ తెలిపారని చెప్పారు.ఈ కార్యక్రమం లో విద్యార్థి సంఘం నేతలు నరేష్, గంగాధర్,సాయి కుమార్,రోహిత్ తదితరులు ఉన్నారు.

# నెక్స్ జెన్ బ్రూక్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఉచిత వైద్య శిబిరం





**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పటాన్ చెరు మండలం ఇంద్రేశం మున్సిపాలిటీ పరిది లోని నెక్స్ జెన్ బ్రూక్ ఇంటర్నేషనల్ స్కూల్లో విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల వైస్ చైర్మన్ నందారం భరత్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రపంచ వైద్యుల దినోత్సవం పురస్కరించుకొని మయూరి హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రముఖ వైద్యులచే ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. నూతనంగా ఏర్పాటు చేసిన తమ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. చదువుతోపాటు క్రమశిక్షణకు ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి, ప్రిన్సిపల్ కీర్తన, పాఠశాల సిబ్బంది,మయూరి హాస్పిటల్ సీఈఓ శ్రీకాంత్,జగదీష్, వైద్యులు పాల్గొన్నారు.



# కోటగిరి అభయహస్తం సొసైటీ వ్యవసాయ కూలీలకు అల్పాహారం అందజేత



**కోటగిరి,దీక్ష ప్రభ:** కోటగిరి మండల కేంద్రంలో కోటగిరి అభయ హస్తం సొసైటీ,భవాని లైన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో వ్యవసాయ మహిళా రైతు కూలీలకు మంగళవారము అల్పాహారం అందజేశారు. వ్యవసాయం మనుగడకు రైతు కూలీలే ఆధారమని అనే మంచి ఆలోచనతో వారికి టిఫిన్,టీ అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. 85 కూలీలకు అల్పాహారం,టీ అందజేసినట్లు తెలిపారు.అనంతరం డాక్టర్స్ డే సందర్భంగా కోటగిరి అభయహస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక సంజీవని హాస్పిటల్లోని వైద్యురాలు ఇంతియాజ్ బేగంకు ఘనంగా సన్మానించారు.డాక్టర్స్ డే సందర్భంగా సంజీవని హాస్పిటల్ లో పేదలకు ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించారు.కోటగిరి అభయహస్తం ఫౌండేషన్ నిర్వాహకులు బర్ల మధు ఉచిత హెల్త్ క్యాంప్ లో పాల్గొన్న రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం కోటగిరి అభయహస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కొట్టం మనోహర్,సిపిఐ మండల కార్యదర్శి విట్టల్ గౌడ్,భవాని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అశోక్ గౌడ్,సెక్రెటరీ సాయిబాబా గౌడ్, ట్రెజరర్ బర్ల మధు,సభ్యుడు శ్రీనివాస్ గౌడ్,శంకర్ గౌడ్ కోటగిరి అభయ హస్తం ఫౌండేషన్ యూత్ సభ్యులు చిత్తరి నరేందర్,హస్గుల విజయ్,ఇందూరి సాయి,పడిగెల సాయిబాబా,హంగర్గ శ్రీకాంత్, ప్రవీణ్, శివరాజ్ పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆద్వర్యంలో ఘనంగా డాక్టర్స్ డే

**కోటగిరి,దీక్ష ప్రభ:** లయన్స్ క్లబ్ ఆఫ్ కోటగిరి అధ్యక్షులు పత్తి లక్ష్మణ్ ఆధర్వంలో లయన్స్ క్లబ్ 320డీ గవర్నర్ అమర్నాథ్ పిలుపుమేరకు మంగళవారం డాక్టర్స్ డే సందర్భంగా కోటగిరి మండల వైద్యాధికారి డాక్టర్.సుప్రియ ను ఘనంగా సన్మానించారు.2025-26 సంవత్సరానికి గాను కోటగిరి లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా పత్తి లక్ష్మణ్ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా డాక్టర్స్ డే నిర్వహించి లయన్స్ క్లబ్ ఆవరణలో శ్రమదానం, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.అనంతరం వన మహోత్సవంలో భాగంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో లయన్స్ సభ్యులు గోగినేని హనుమంతరావు, నార్ల శ్రీనివాస్, నిశాంత్ గుప్తా,అనిల్ కుమార్, ఉదయ్ భాస్కర్,కూచి సిద్దు, బీర్కూర్ శ్యామ్,తదితరులు పాల్గొన్నారు.



# సీఎం రేవంత్ రెడ్డితో కలిసి సిగాచి పరిశ్రమను పరిశీలించిన ఎమ్మెల్యే జీఎంఆర్

## భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోండి

## ఇస్నాపూర్ లో ప్రభుత్వ ట్రామా కేర్ ఏర్పాటు చేయండి

## అసంఘటితరంగ కార్మికులకు ప్రమాద బీమా కల్పించండి



**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** సిగాచి పరిశ్రమ దుర్ఘటనను ఒక గుణపాఠంగా తీసుకుని రాబోయే రోజుల్లో పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని ఫార్మా, కెమికల్ పరిశ్రమల్లో ప్రమాదాలు చోటు చేసుకోకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని పరిశ్రమలలో పనిచేస్తున్న అసంఘటితరంగ కార్మికులకు 50 లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి కోరారు.మంగళవారం సిగాచి పరిశ్రమను సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు వివేక్, దామోదర రాజనర్సింహ, పొంగులేటి సుధాకర్ రెడ్డి,దుద్దిల్ల శ్రీధర్ బాబు లతో కలిసి ఎమ్మెల్యే జీఎంఆర్ సందర్శించారు.దుర్ఘటన జరిగిన పరిశ్రమలోని వివిధ విభాగాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ పలు అంశాలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.ఆసియాలోని అతిపెద్ద పారిశ్రామిక వాడగా పాశమైలారంలో వేలాది బల్క్ డ్రగ్స్, ఫార్మా, కెమికల్ పరిశ్రమలు తమ ఉత్పత్తులను కొనసాగిస్తున్నాయని తెలిపారు. ప్రధానంగా పలు పరిశ్రమలలో భద్రత ప్రమాణాలు పాటించకుండా, శిక్షణ లేని దినసరి కార్మికులతో రియాక్టర్లు,బాయిలర్లు నడిపిస్తున్నారని దీని మూలంగా భారీ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. యాజమాన్యాల కక్కుర్తి మూలంగా కార్మికులు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పని చేయాల్సిన దారుణ పరిస్థితులు నెలకొంటున్నాయని పేర్కొన్నారు. ఈ అంశంలో ప్రభుత్వం ప్రత్యేక కమిటీని మించి పూర్తిస్థాయిలో తనిఖీలు చేపట్టి భవిష్యత్తులో ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని కోరారు. పటాన్ చెరులో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సిద్ధం అవుతున్నప్పటికీని,ఇస్నాపూర్ లో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రభుత్వ ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. ట్రామా కేర్ ద్వారా ప్రమాదం చోటు చేసుకున్న వెంటనే సత్వర వైద్యం అందించగలుగుతామని తెలిపారు. అదే విధంగా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన నిరుపేద ప్రజలు పొట్టకూటి కోసం స్థానిక పరిశ్రమలలో దినసరి కూలీలుగా పనిచేస్తున్నారని,వారికోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడంతో పాటు 50 లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యాన్ని అందించేలా యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అనంతరం పటాన్ చెరు పట్టణంలోని ధ్రువ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను పరామర్శించారు.





# పాశమైలారం ఘటన దేశాన్ని కలచివేసింది





- కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి గంగాపురం కిషన్ రెడ్డి
- సిగాచి పరిశ్రమను పరిశీలించిన కేంద్ర మంత్రి

**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచి పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటన దేశాన్ని కలిచివేసిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటన చాలా దురదృష్టకరమైన సంఘటనగా అభివర్ణించారు. మంగళవారం బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు, పట్టభద్రులు ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి లతో కలిసి ఘటన స్థలాన్ని సందర్శించారు.అనంతరం కేంద్రం మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ..ఇప్పటి వరకు 48 మృతదేహాలు వెలికితీయబడినట్టు తెలిపారు. ఇంకా 11 మంది ఆచూకీ లభించాల్సి ఉందని వెల్లడించారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. గతంలోనూ ఇలాంటే ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల సంభవించి 11 మంది మృతి చెందారని గుర్తు చేశారు.

### పరిశ్రమలపై తనిఖీల మోతాదు పెంచాలని సూచన

ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర మాధురి కిషన్ రెడ్డి కోరారు. పరిశ్రమలలో తనిఖీలు నిజంగా జరుగుతున్నాయా,లేక కేవలం లంచాల కోసమేనా అన్న సందేహాన్ని వ్యక్తం చేశారు. పరిశ్రమల తనిఖీల ప్రక్రియను పటిష్టంగా మార్చాల్సిన అవసరం ఉందని ప్రభుత్వానికి సూచించారు. సిగాచి సంస్థకు చెందిన మరో మూడు పరిశ్రమలనూ తనిఖీ చేయాలని సూచించారు. ప్రమాదానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేదవారు పొట్టకూటి కోసం వస్తూ ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని ఆయన అన్నారు.

### ప్రభుత్వ సహాయం, కేంద్రం నుంచి భరోసా..

ప్రమాదంలో మృతుల జాబితా వచ్చిన వెంటనే సంబంధిత రాష్ట్రాల్లో తమ పార్టీ తరఫున మద్దతు ఉంటుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు. శిధిలాల కింద చిక్కుకున్న మృతదేహాల కోసం పోలీస్ జాగిలాలను వినియోగించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు. పారిశ్రామిక ప్రాంతాల్లో ఎప్పుడైనా అపాత పరిస్థితుల్లో ఉపయోగపడేలా అంబులెన్స్‌లు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇది రాజకీయాల సమయం కాదని, బాధితులకు న్యాయం చేయడం ప్రాధాన్యమని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.



# జులై 9న నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలి

### కార్మిక, ప్రజా సంఘాలకు జిల్లా ఏఐటీయూసీ నాయకుడు విట్టల్ గౌడ్ పిలుపు

**కోటగిరి,దీక్ష ప్రభ:** జులై 9న కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా కోటగిరి తాసిల్దార్ ఆఫీస్ ఎదుట నిర్వహించనున్న సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు విట్టల్ గౌడ్ పిలుపునిచ్చారు. కోటగిరి మండల కేంద్రంలో ఏఐటీయూసీ, సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారము ప్రెస్ మీట్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా నాయకులు విట్టల్ గౌడ్ మాట్లాడుతూ..ఈనెల 9న దేశవ్యాప్త సమ్మె భాగంలో కోటగిరి తాసిల్దార్ ఆఫీస్ ముందు సమ్మె నిర్వహించడం జరుగుతుందని, కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని, కేంద్ర ప్రభుత్వం 11 సంవత్సరాలు కొనసాగుతున్నా ఇప్పటివరకు కార్మిక సంక్షేమ బోర్డును నిర్వహించలేకపోవడం సిగ్గుచేటు అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కార్మికుల హక్కులకు వ్యతిరేకంగా తీసుకొస్తుందని 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి 12 గంటల పనిని చేయాలని కార్మికులకు ఆదేశాలు జారీ చేస్తున్నారన్నారు. లేబర్ కోడ్స్ చట్టాలను రద్దుచేసి కార్మిక చట్టాలను పునర్దించాలని డిమాండ్ చేశారు.ఈ సమ్మెలో మధ్యాహ్న భోజన కార్మికులు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ,ఆశా వర్కర్లు, సివిల్ సప్లై కార్మికులు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో,నల్ల గంగాధార్, గుడాల రాములు, కప్ప హనుమల్లు,ఎడ్డెడి దత్తు,పాష, గుడాల శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సిగాచి పరిశ్రమ ఘటనలో 42 మంది కార్మికుల మృతి

**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలో సిగాచి ఇండస్ట్రీస్ ఫార్మా ప్లాంట్‌లో సోమవారం భారీ పేలుడు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. పేలుడు ధాటికి మూడంతస్తుల భవనం కుప్పకూలింది.అయితే ఈ ఘటనలో మృతుల సంఖ్య 42కి చేరింది.అయితే ఈ ప్రమాదంలో గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉండటం, పేలుడు శిథిలాల కింద మరికొందరు చిక్కుకుని ఉన్నారనే అనుమానాల నేపథ్యంలో మృతుల సంఖ్య పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. పరిశ్రమ తనికి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాయిలర్లను తనిఖీ చేసి ఏమైనా సమస్యలు గుర్తించారా,బాయిలర్ల పనితీరుపై యాజమాన్యానికి ఏమైనా సూచనలు చేశారా అని ప్రశ్నించారు. పరిశ్రమల్లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. ఈ పరిశ్రమలో గతంలో ఏమైనా ప్రమాదాలు జరిగాయా అని ప్రశ్నించారు. ఊహాజనిత సమాధానాలు చెప్పవద్దని స్పష్టం చేశారు.ప్రమాద ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. ప్రమాద ఘటనపై నివేదిక కోసం నిపుణులను నియమించాలని సూచించారు. నిపుణులతో చర్చించిన తర్వాతే సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. కార్మికులకు బీమా సదుపాయం ఉందా అని అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమకు అనుమతులు, భద్రతా ప్రమాణాలపై ఆరా తీశారు. సిగాచీ పరిశ్రమకు సంబంధించిన మొత్తం సమాచారం సేకరించాలని ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని పరిశ్రమల్లో తనిఖీలు చేపట్టాని స్పష్టం చేశారు. ఇలాంటి ప్రమాద సమయంలో మానవత్వంతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. పరిహారం విషయంలో తీసుకున్న నిర్ణయం చెప్పాలని కంపెనీ ప్రతినిధిని అడిగారు. ప్రమాదంపై కంపెనీ యాజమాన్యం బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. పరిశ్రమలో పనిచేసే వారి నైపుణ్యాల గురించి సీఎం ఆరా తీశారు. ప్రమాదం జరిగి 24 గంటలు దాటినా యాజమాన్యం ఘటనా స్థలికి రాకపోవడం బాధాకరమని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. ప్రమాద ఘటనను కార్మిక, వైద్యశాఖ మంత్రులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. సీఎం వెంట మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ,వివేక్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి,పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి,తదితరులు ఉన్నారు.



# ఎమ్మెల్యే జీఎంఆర్ ఉదారత

- కొడకంచి అంగన్వాడి కేంద్రానికి లక్ష రూపాయలు
- జిన్నారం ఎస్టీ గురుకుల పాఠశాల మౌలిక వసతులకు 87 వేల రూపాయలు
- కొర్లకుంట చిత్తారమ్మ ఆలయ నిర్మాణానికి 2 లక్షల రూపాయల విరాళం
- త్వరలోనే 28 లక్షల రూపాయల సొంత నిధులతో చిత్తారమ్మ ఆలయ పనులు పూర్తి



**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. జిన్నారం మండలం కొర్లకుంట గ్రామంలో నిర్మిస్తున్న చిత్తారమ్మ దేవాలయానికి గతంలో 26 లక్షల రూపాయల సొంత నిధులు అందించగా, మిగిలిన పనుల కోసం మంగళవారం మరో రెండు లక్షల రూపాయలు అందించారు.అదే విధంగా జిన్నారంలో నిర్మిస్తున్న శివాజీ స్టేడియం బోర్డ్ ఏర్పాటు కోసం 37 వేల రూపాయలు, జిన్నారం పరిధిలోని ఎస్టీ గురుకుల పాఠశాలలో మంచి నీటి పైపులైన్లు, ఎర్తింగ్ పనుల కోసం 90 వేల రూపాయలను అందించారు. మంగళవారం పటాన్ చెరులోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్,మాజీ సర్పంచులు జనార్ధన్, శివరాజ్, ఆంజనేయుల సమక్షంలో సంబంధిత ప్రతినిధులకు డబ్బులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ..నియోజకవర్గ వ్యాప్తంగా సొంత నిధులచే దేవాలయాలు, మసీదులు, చర్చిలు నిర్మిస్తూ పరమత సహనాన్ని పెంపొందిస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేస్తూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు.కొడకంచి గ్రామంలో నిర్మిస్తున్న అంగన్వాడి సెంటర్ భవన నిర్మాణ పనులను ప్రతిఘటన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.రాబోయే ఆగస్టు నెలలో వీటిని ప్రారంభించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అమీన్ పూర్ మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి,సీనియర్ నాయకులు అంతిరెడ్డి,బండి శంకర్,తదితరులు పాల్గొన్నారు.